# ఉషస్సంధ్యలు

పురాణపండ రంగనాథ్



శ్రవ్య నాటిక

మాధవ్ : కవి. వయస్సు 50 సంవత్సరాలు.
దీప్తి : సైంటిస్టు. వయస్సు 40 సంవత్సరాలు.
సూరజ : మాధవ్ ప్రతిరూపం. 20 సంవత్సరాలు.
సైన్స్ క్లబ్ ప్రతినిధి : 35 సంవత్సరాలు.

**1**

దీప్తి : ఇక రెండు రోజులకన్నా ససేమిరా ఉండనంటావు. అంతేనా ?

మాధవ్ : ముందు అలాగే అనుకొన్నాను. కాని, ఇక్కడి ఈ ప్రశాంత వాతావరణం, ఈ తోటలో పూలూ, నిశ్శబ్దాల మొదళ్ళు, ఈ చుట్టూ కొండలూ, నీ లేబరేటరీలో వింతలూ నన్ను వెళ్ళవద్దంటున్నాయి. ఇంకా ఇక్కడే ఉండాలనిపిస్తోంది. నువ్వు వద్దంటే వెళ్ళిపోతాను.

దీప్తి : హాయిగా ఉండు. ఇక్కడే ఉండిపొమ్మని నీకు ఎన్నిసార్లు చెప్పలేదు. కాని నువ్వు వింటేగా. ప్రకృతి, ఆరాధన, వైవిధ్యం, దేశాటనం అంటూ తిరుగుతుంటావు.

మాధవ్ : (నవ్వి ) ఒక్కచోటే కట్టుబడి ఉండిపోతే తిరగలి గురుజుకూ, మనకూ పెద్ద తేడా ఏమీ ఉండదు. అదీకాక పాతదనంలో కూడా నిత్యనూతనత్వాన్ని చవి చూడాలంటే, పరిసరాలు మారుతుండాలి. ఆ మూల వేపమొక్క చూడు. నిరుడు నేను వచ్చేసరికి ఎలా ఉంది? ఇప్పు డెంతగా ఎదిగింది? అప్పుడది కోరకిస్తున్న నవకిసలయం. ఇప్పుడు లేతకొమ్మల గుమ్మటం. దీప్తీ ! స్వల్పమైన అనుభవం శాశ్వతానుభూతిగా మారాలంటే రసపిపాస ఉండాలి.

దీప్తి : సరేలే ! ఏం మాట్లాడినా—రసదృష్టి, రసపిపాస, కవిత్వం అని సాహిత్య చర్చ మొదలెడతావు. లే ! సైన్స్ క్లబ్ మీటింగ్‌కు వెళ్ళాలి.

మాధవ్ : నిద్రపోయి లేచాక పక్కమీద అరగంటసేపు కూర్చుంటే కాని బద్ధకం వదలదు. ఇదేం అలవాటో ? దీప్తీ! ఈ అలవాట్లూ, బలహీనతలూ గురించి నీ జీవశాస్త్రం ఏం చెబుతుంది చెప్పు.

దీప్తి : జీవశాస్త్రం ప్రకారం అలవాటు వేరు, ప్రేరణ వేరు. అలవాట్లు తెచ్చిపెట్టుకున్నవి. ప్రేరణ సహజమైనది. సాలెపురుగు గూడు అల్లడం, పట్టుపురుగు కవచం నిర్మించుకోవడం....ఇలాంటివి ప్రేరణలు. ఆనువంశికంగా సంక్రమించేవి. అలవాటు అలా కాదు. అవి సంతానానికి అందవు. సరేలే ! సైన్స్ టాపిక్స్ ఎత్తితే నాకు పొద్దు తెలియదు. లే ! తెమలాలి.

మాధవ్ : సాహిత్య చర్చ వస్తే నాకు ఒళ్ళు తెలీనట్లు.

దీప్తి : మాధవ్ ! రావాలి. మనకు టైమ్ అవుతోంది.

మాధవ్ : వచ్చేస్తున్నా...పది నిమిషాలు.

( వి రా మం )

**2**

సైన్స్ క్లబ్ ప్రతినిధి : సైన్స్ క్లబ్ తరపున ప్రఖ్యాత కవి శ్రీ మాధవ్‌గారికి స్వాగతం చెబుతున్నాను. ఈనాడు మన క్లబ్ వేదిక త్రివేణీసంగమం అయింది. ఒకరు సాహిత్య సరస్వతి మాధవ్. మరొకరు విజ్ఞాన జాహ్నవి



J BROTHERS/Z8/4682 TEL.


డాక్టర్ దీప్తి. మనందరం యమునా తరంగాలం. అందుకే ఇది 'త్రివేణి సంగమం' అంటాను నేను.

''జాహ్నవీ ఝుంఝు'' ఖండ కావ్యంలో శ్రీ మాధవ్ ప్రాచీన, అర్వాచీన కవితారీతులకు పాదుచేశారు. ప్రబంధ ఫక్కీలో వ్రాసినా, ఆయన అభ్యుదయవాది. వచన ఖండికలు వ్రాసినా, ఆయన కవితామర్మ స్పర్శవేది. అందుకే నాడు—నేడులకు ఆయన వారధి అంటాను నేను. ఇక దీప్తిగారి గురించి వేరే పరిచయం అనవసరం. జీవ రసాయన శాస్త్రంలో అనితర సాధ్యమైన అద్భుత పరిశోధనలు చేస్తున్న విజ్ఞాన తపస్వి ఆమె. ఇప్పుడు శ్రీ మాధవ్‌గారు కవితా గానం చేస్తారు.

మాధవ్ : సాహిత్య ప్రియులైన సైన్స్ క్లబ్ సభ్యులకు సుమహాంజలి. 'జాహ్నవి—ఝుంఝు' అనేవి రెండు పదాలు. దానిని సమాసం చేసి చెప్పారు మిత్రులు. ఆ పుస్తకంమీద 'జాహ్నవి—ఝుంఝు' అని ఉంటుంది. ఈ కావ్యంలో జాహ్నవి మొదటి భాగం. రెండవ భాగం ఝుంఝు...ప్రబంధ ఫక్కీ ఖండికల సమాహారం జాహ్నవి. వర్తమాన సమాజ నగ్న చిత్రాల ఉపాహార ఝుంఝు. ఝుంఝులోని ఒక చిరు కవిత వినిపిస్తాను. (కవితా ఫక్కీలో )

''టెరికాటన్ దుస్తుల్లో ఆకలి ఆక్రందనాలు
కాస్మటిక్ మేకప్స్‌లో తీరని కోర్కెల జ్వాలలు
ఎటికేట్ మత్తులో మమతలు మర్డర్
వానిటీ మజాలో మానవత్వానికి శిలువ
ఎక్స్‌ప్లోడ్ అయేందుకు సిద్ధంగా ఉన్న
టైమ్ బాంబ్ గ్లోబంతా
పేలుతుంది—పేలుతుంది — ఎప్పుడైనా—
పేలుతుంది—తప్పకుండా పేలుతుంది
ఎటికెట్లూ, వానిటీలు, సూడో స్టైల్సూ
అల్ట్రా ఫాషన్లూ—అన్నింటికీ సమాధి
శాంతి సమాధి—నిశ్శబ్ద సమాధి—
పాత బొందమీద మొలుస్తుంది,
లేక మొక్కలా నూతన సృష్టి
మానవత్వపు చిగురాకులతో
విశ్వప్రేమ మనే మొగ్గ తొడుగుతూ
పాత బొందమీద మొలుస్తుంది,
లేత మొక్కలా నూతన సృష్టి—''

(చప్పట్లు . . . . . . . . . . . . హర్షధ్వానాలు )

క్లబ్ ప్రతినిధి : ఇప్పుడు డాక్టర్ దీప్తి జీవశాస్త్ర పరిశోధనలు, ఇటీవలి పరిణామాలు గురించి ముచ్చటిస్తారు.

దీప్తి : ఆవేదనాపరుడైన కవి భావనలకు అనుగుణంగా నూతన సృష్టికి నాంది పలకాలని జీవరసాయన శాస్త్రం కృషి చేస్తోంది. జడప్రాయమైన పదార్థ సముచ్చయం తనలోనుండి అత్యుత్తమ జీవిని ఆవిష్కరింప చేయడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ సృష్టి, పరిణామమూను! ఆ విలసనంలోనే ఇన్ని లక్షల రకాల జీవులు ఆవిర్భవించాయి.

అవసరాలకు, పరిసరాలకు అనుగుణంగా అంగాంగాల్ని సంతరించుకొని, సంతాన ప్రాప్తి ద్వారా జాతి మనుగడను కొనసాగించడం జీవుల విశిష్ట లక్షణం. అయితే రోదసీ కుటుంబాలు వెలయనున్న వర్తమాన స్థితిలో పరిణామాన్ని, కాల ప్రమాణాన్ని కుదించడం అవసరమైంది. ఉత్తమజాతి మానవుల అవసరం పెరిగింది. ఇందుకు సాంకర్యం ఒక పద్ధతి అనుకున్నాం. కాని, అనువంశిక రోగాల బెడద తప్పలేదు. ఈ సమస్యను అధిగమించడానికి ''అలింగోత్పత్తి మంచి పద్ధతి'' అని భావిస్తున్నారిప్పుడు. ఉత్తమ లక్షణాలు కల స్త్రీ, పురుష జీవకణాలను కృత్రిమ రసాయనాలలో పెంచడం ఈ ప్రక్రియ. క్రింది తరగతి మొక్కలు, జంతువులలో ఈ పద్ధతి సత్ఫలితాలను ఇస్తున్నది. అయితే జీవకణాల అవసరం అంతగా లేకుండా మనిషి ప్రతిరూపాన్ని సృష్టించ గలిగితే మృత్యువును జయించినట్లే. ఈ ప్రక్రియ సులభసాధ్యమైతే, భవిష్యత్తులో భూగోళం స్వర్గతుల్యమే అవుతుంది. అసంపూర్ణ సృష్టి చిత్రాన్ని పూరించే యత్నమే ఈ పరిశోధనల పారమ్యం.

( చప్పట్లు —విరామం. )

## 3

దీప్తి : ఈ సంవత్సరం చలి ఎక్కువగా ఉంది కదూ !

మాధవ్ : చలి అప్పుడూ, ఇప్పుడూ ఒక్కటే! కాకపోతే మన శరీరాల్లో దార్ఢ్యం తగ్గింది. అందుకని కొంచెం చలి కూడా తట్టుకోలేక ఎక్కువగా ఉందను కుంటున్నాం అంతే!

దీప్తి : మాధవ్! చదువుకొనే రోజుల్లో నువ్వు తెల్లవారకట్ల లేచి వామనస్తుతి చేసేవాడివి. గొంతెత్తి ప్రార్థనా గీతాలు పాడేవాడివి. ఇప్పుడు కూడా పాడు.

మాధవ్ : బాల్యం బంగారం గని, నాటి ఉత్సాహం ఇప్పుడు నాలో లేదు. జీవితంలో నేను నోచుకోనిది ఏమిటో నీకు బాగా తెలుసు.

దీప్తి : మాధవ్! నిత్య యవ్వనం దేవతలకే దక్కింది. ఇంక మనుషులు అంటావా?! వయస్సులో ఉన్న నాటి ముచ్చట్ల పలకరింపులతో జీవిత ద్వితీయార్థాన్ని గడిపి వేయాలి.

మాధవ్ : కాని. నాకు పులకరింతలు. పలకరింపులు లేవు. చెడు సావాసాలతో, పుంస్త్వం కోల్పోయిన నేను . . హ...

దీప్తి : కలతపడతా వెందుకు, మాధవ్! మన ఆర్ష ధర్మం ప్రకారం వాన ప్రస్థాశ్రమం స్వీకరించవలసిన వయస్సు వచ్చింది నీకు.

మాధవ్ : కాని, నా మనస్సు పండలేదు. నాది అసంతృప్త మానసం. అందుకే రచనలు, కవిత్వం అని బతుకుతున్నాను. నవకిసలయాలు, మొగ్గ తొడిగిన మల్లెకొమ్మలు, రేకు విప్పిన తుమ్మి పువ్వులు, గంతులు వేసే లేగదూడలు వీటిని చూసినప్పుడు నాలో అశాంతి వామనుడు త్రివిక్రమ విజృంభణ చేస్తాడు. అసంతృప్తి పులి పంజా విప్పి మనస్సుపై దెబ్బ తీస్తుంది. నా అసంపూర్ణ పురుషత్వం నన్ను నిలువునా దహించివేస్తుంది.

దీప్తి : మాధవ్!

మాధవ్ : నా పేరు ఇప్పుడు మాధవ్ కాదు. అసంతృప్తి వామనుడు, దీప్తీ! నా ఈ ఆవేదనను తీర్చగల దానివి నువ్వే!

దీప్తి : ఏమిటి, మాధవ్! వింతగా మాట్లాడుతున్నావ్! మనది పవిత్రమైన స్నేహం. కోరికల కతీతమైన భావ సామీప్యం మనది. ఇప్పుడు...

మాధవ్ : నేను నిన్ను కోరడం లేదు. నీ సహాయాన్ని కోరుతున్నాను.

దీప్తి : ఏమిటది?

మాధవ్ : దీప్తీ! సంతానం మీద జీవులకు అంత మమకారం దేనికో తెలుసా?

దీప్తి : రక్తం పంచుకు పుట్టాయి కనుక, ఆనందానికి ప్రతిఫలాలు కనుక.

మాధవ్: (పిచ్చిగా ) కాదు.

దీప్తి : మరెందుకని!?

మాధవ్ : (క్రూరత్వం, ఆర్ద్రత మిళితం కాగా ) తమలో అంతరించిపోతున్న వయస్సు, యవ్వనం, ఉత్సాహం, నైర్మల్యం, కోరికలు, తపన, చిలిపితనం ఒకటేమిటి అన్నీ సంతానంలో పున: అంకురించి సహస్రముఖాలుగా వికసిస్తాయి కనుక ... జీవులకు సంతానం అంటే అంత మమకారం. నాకూ నా ప్రతి రూపాన్ని చూసుకుని.. . .

దీప్తి : మురిసిపోవాలనుంది?

మాధవ్ : అవును . . .నా ప్రతి రూపం పూర్ణపురుషత్వంతో తిరుగాడుతూంటే చూడాలనుంది.

దీప్తి : కాని, నీది దురాశ . . . ఎండమావిలో . . .

మాధవ్ : స్వాదు జలాలను అన్వేషించడం కాదు. ఒయాసిస్సులో దప్పిక తీర్చుకోవడం. కాదనకు, దీప్తీ! నన్ను సృష్టించు. నా ఉత్సాహాన్ని నా కళ్ళముందే నడిపించు. ఆ నాటి నా చిలిపి చేష్టలను, ఆ నా కోరికలను అక్కడ నర్తింప చేయి, దీప్తి! ఈ ఉపకారం చేయలేవా? ఎలాగూ నీవీ రకం పరిశోధనలు చేస్తున్నావుగా ... నన్నే స్పెషిమెన్‌గా తీసుకో.

దీప్తి : ఇది చాలా సంక్లిష్ట ప్రయోగం.

మాధవ్ : జీన్ ఉనికి తెలుసుకోవడం కన్నానా? మనిషికీ, అతడి సాధనకీ అసాధ్యం ఏమీ లేదు. నువ్వు నన్ను సృష్టించాలి. అప్పుడు.

దీప్తి : సరే! నిన్ను సృష్టిస్తాను. నా తపన ఫలిస్తే నీ వేదన తీరుతుంది.

మాధవ్ : అప్పుడు నీకు సైన్స్ ప్రపంచంలో పెద్ద పేరు వస్తుంది. మన మిత్రత్వానికి ఒక సార్థక్యంసిద్ధిస్తుంది

(విరామం)


స్వేచ్ఛ!
స్త్రీ తమ స్వేచ్ఛ-నెలలో 5 రోజులు కోల్పో వలసిందేనా?



న్యూ ఫ్రీడం–ఆ స్వేచ్ఛను దక్కించుకునేలా ఆమెకు సహాయపడుతుంది. న్యూ ఫ్రీడం – ఆమెకు ఆత్మ విశ్వాసం, సౌఖ్యం, రక్షణ కలిగిఉన్నా నన్న భావన కలిగిస్తుంది.

ఇప్పుడు క్రొత్త ఆకర్షణీయమైన ప్యాక్ లో




న్యూ ఫ్రీడం, సుతిమెత్తని. వెన్నెల లాటి తెల్లని శానిటరీ నాప్‌కిను–విదేశీ యంత్రాలపై ఆరోగ్యవిధుల కనుగుణంగా, అద్భుతంగా చెమ్మను పీల్చుకునేలా, శరీర భాగాలకు చక్కగా అమరేలా అతి జాగ్రత్తగా చేయబడ్డాయి.



ప్రత్యేక రక్షణ కవచం : వెడల్పాటి "ప్రొటెక్టా" కవచం ఏమాత్రం కారని విధంగా మీ న్యూ ఫ్రీడం నాప్‌కిన్‌ను దిగ్బంధం చేస్తుంది.



శ్రేష్ఠమైనది : ప్రత్యేక "డిస్పర్సా" రేయాన్ పొర తేమనులోనికి జాల్చడంలో అద్వితీయంగా పనిచేస్తుంది. మృదువైన మెత్తని రేయాన్ వల మెరికలుపడి అసౌకర్యం కలగడాన్ని నివారిస్తుంది.

తక్కువ ధరలో నమ్మ శక్యంగాని నాణ్యత! ఈ రోజే 'న్యూ ఫ్రీడం'కు మారండి! స్వేచ్ఛగా అడుగు ముందుకు వెయ్యండి.

న్యూఫ్రీడం ఆ స్వాభావికమైన అనుభూతి కోసం.

Dazzal

## 4

మాధవ్ : ( భాగవతం పురాణ ప్రవచన ఫక్కీలో చదువుతూంటాడు)...అనగ విని తల్లియైన దేవహూతి కిట్లనియె —

స్త్రీ గర్భంలో శుక్ర—శోణిత సంయోగంతో జీవి యాతన ప్రారంభం అవుతుంది. ఐదు రాత్రులకు బుద్బుదంగా, పది రాత్రులకు బదరీ ఫల ప్రమాణంలో పరిణమిస్తుంది. ఒక మాసంలో శిరస్సు, రెండవ మాసంలో కాళ్ళూ చేతులు, మూడవ మాసంలో నఖ, రోమ, అస్థి చర్మాదులు, స్త్రీ లింగ—పురుష లింగ భేదం ఏర్పడతాయి. నాల్గవ మాసంలో సప్త ధాతువులూ ఏర్పడి, క్రమంగా పెరిగి, గర్భాశయ మందు జరాయువుచే కప్పబడి, ప్రేవులచే బంధింపబడి శిరస్సు కుక్షియందు మెడ, నడుమూ వంగి కుండలా కారంగా ఉంటుంది జీవి — పది మాసాల అనంతరం ప్రసవ కాలీన వాయువు గర్భాన్నుండి బిడ్డను బయటకు నెట్టేస్తుంది—అని కపిలుడు ఇంకా ఇలా అంటున్నాడు.

దీప్తి : (కంగారుగా వస్తూ) మాధవ్! భాగవతం కట్టిపెట్టు. లేబరేటరీ లోనికి రా మాతృగర్భం, స్త్రీ పురుష బీజకణాల సంయోగం అవసరం లేకుండా ప్రత్యేక పద్ధతులలో నీ ప్రతి రూపాన్ని సృష్టించగలిగాను. పదిరోజులలో పదిమాసాల బిడ్డను పెంచాను

మాధవ్ : ఐతే నా ప్రతి రూపానికీ ప్రాణం వచ్చేసినట్లేనన్న మాట.

దీప్తి : ఆహా! ఇంక కొన్ని రకాల హార్మోనులు ఎక్కించాలి అప్పుడు నా పరిశోధన పూర్తి అయినట్లే

మాధవ్ : పద లేబరేటరీలోకి (తొందర పెడుతూ) లేబరేటరీలో నన్ను నేను బాల్యంలో చూసుకుంటాను.

దీప్తి : పద . . .

( విరామం )

★ ★ ★

దీప్తి : ఇదిగో ఈ కృత్రిమ గర్భకోశంలో ఆ ప్లాస్టిక్ మావి మధ్య నెత్తురు ముద్దలా ఎర్ర తామరలా, మాంసపు బొమ్మలా నువ్వు...

మాధవ్ : ( వెర్రి ఆనందంతో ) దీప్తీ! ఇప్పుడు నా వయస్సు పదినెలలు. ఎంత వింత అనుభూతి ఇది! ఏభై ఏళ్ళ కాలం ఒక్కసారి వెనక్కు వెళ్ళింది.

దీప్తి : కాదు. పది మాసాల కాలం పది రోజులకు కుదింపబడింది. మాధవ్! ఈ అపూర్వ సన్నివేశానికి నీ కవిత్వం ఇచ్చే నిర్వచనం ఏమిటి?

మాధవ్ : అస్థి అంతర్వీక్షణం జరపడం అంటాను, మామూలు భాషలో మనల్ని మనం చూసుకోవడం.

దీప్తి : అద్దంలో చూసుకుంటున్నాంగా?

మాధవ్ : ( నవ్వి ) అది ప్రతిబింబం — ప్రాణంలేనిది. ఇది ప్రతిరూపం. చైతన్య ప్రతిమ. అది నీడ కాలిక్రింద నలిగేది. ఇది కాంతి. నెత్తిన వెలిగేది. థాంక్స్, దీప్తీ, థాంక్స్!

దీప్తి : ఇందులో నా గొప్పేం లేదు. అంతా ఈ కృత్రిమ గర్భాశయం, ఈ కంప్యూటర్, ఈ రసాయనాలు ... వీటివల్ల నేను ఈ ప్రయోగం విజయవంతం చేయగలిగాను. ఇక్కడ నేను నిమిత్తమాత్రురాల్ని—అంతే!

( విరామం )

## 5

మాధవ్ : ( భాగవతం పురాణ ప్రవచన పద్ధతిలో చదువుతూ ఉంటాడు. ) బలిచక్రవర్తినుండి త్రిపాద ధరణిదానం గ్రహించిన వామనుడు చూపరులకు ఆశ్చర్యం కలిగించేవిధంగా విశ్వరూపం ధరించాడు. భూమ్యాకాశాలు , స్వర్గ పాతాళాలు, సముద్రాలు, పశు పక్ష్యాదులూ—ఆ రూపమందే ఇమిడి ఉన్నాయి. పాదతలమందు రసాతలం, పాదాలయందు భూమి, జంఘలయందు పర్వతాలు, నాభియందు ఆకాశం, వక్షస్థలమందు నక్షత్రమండలం — ఈ విధంగా వామనుడు త్రివిక్రమ విజృంభణం చేస్తున్నాడు...

దీప్తి : ( హడావిడిగా ) మాధవ్! ఆ నాటి వామనుడి త్రివిక్రమ విజృంభణ సంగతి నాకు తెలియదు కాని, నీ ప్రతిరూపం ... అదే మన సూరజు చేస్తున్న ఆగడాలు అంతా ఇంతా కాదు. వాడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక లేబరేటరీ అసిస్టెంట్లు, ఆయాలు నానా యాతనా పడుతున్నారు. ఇలా రా — వాడేం చేస్తున్నాడో చూద్దువుగాని.

మాధవ్ : వస్తున్నా! ఏడీ...సూరజు! ఎక్కడ?

దీప్తి : అదిగో అక్కడ ఉన్నాడు. లక్నో నుంచి నా స్నేహితురాలు వచ్చింది. ఆమెకు తెలుగురాదు. సూరజుకి హిందీ రాదు. వాడు తోటలో పూలు కోసుకువచ్చాడు. దారం కావాలి. హిందీలో అడగడం తెలియక—దగ్గర్లో దొరికిన చీపురుపుల్ల తెచ్చి పూలు గుచ్చి దారం కావాలని అర్థంవచ్చేటట్లు చూపిస్తున్నాడు. చూడు వాడి సమయస్ఫూర్తి.

మాధవ్ : అవును వాడిది వాడి సమయస్ఫూర్తి.

దీప్తి : నువ్వూ అంతేగా, మాధవ్! నీ చిన్ననాటి రూపాన్ని చూశాక నీలో కవిత ఉప్పొంగటం లేదా?

మాధవ్ : దీప్తీ! అసంతృప్త మానసక్షేత్రంలోనే కవితా మందారాలు పూస్తాయి. ఇప్పుడు నాకు అసంతృప్తి లేదు. వాడలా పెరిగి పెద్దవాడవడం నాకు కావాలి.

దీప్తి : కాని, వాడిలో మానవశిశు సహజమైన ఆత్మీయత లేదు. అన్నింటికోసం ఫస్సుగా ఉంటాడు.

మాధవ్ : వాడు పూర్ణ పురుషుడు కావాలి — అంతే.

దీప్తి : ఇంకొక నెల వ్యవధానంలో వాడు యువ్వనదశకు చేరుకుంటాడు. వాడు నీ వలె మంచి కవి అవుతాడు. మీ రిద్దరూ ఒకే వేదిక మీద కవితాగానం చేస్తుంటే చూడాలని ఉంది. వాడికి అన్నీ కృత్రిమ పద్ధతుల




ద్వారా నేర్పిస్తున్నాను. జ్ఞాపకశక్తి వాహకాలైన ఆర్. ఎన్. ఎ., డి. ఎన్. ఎ, వంటి అతి ప్రధాన రసాయనాలను వాడికి ఇంజక్ట్ చేస్తున్నాను. చూస్తావుగా — నీ ప్రతిరూపం ఎలా త్రివిక్రమ విజృంభణ చేస్తుందో!

మాధవ్ : ( నవ్వి ) సరే!

( విరామం )

## 6

( సభలో కలకలం వినిపిస్తుంటుంది. )

మాధవ్ : ( ఆప్యాయంగా ) బాబీ!

సూరజు : ( నిర్లక్ష్యంగా ) నా పేరు సూరజు!

మాధవ్ : చిన్నప్పటినుండి నిన్ను బాబీ అనే పిలుస్తున్నాను.

సూరజు : ఇంక అలా పిలవడం మానేయండి. నా పేరొకటి ఉండగా—అనామత్తు పేర్లు నాకు కిట్టవు.

మాధవ్ : ( శుష్కంగా నవ్వి )కవితాగానానికి వెళ్ళేముందు డాక్టర్ దీప్తి ఆశీర్వచనాలు పొంది వెళ్ళు.

దీప్తి : ముందు ఆయన ఆశీర్వాదాలు తీసుకో.

సూరజు : ఎందుకని?

ఆంధ్రుల అభిమాన రచయిత్రి
కుమారి ఆర్. సంధ్యాదేవి
తన అభిమాన పాఠకులకు సమర్పించు డైరెక్టు నవలలు
హృదయ రాణి రు. 12-50
హిమబిందు రు. 12-00
రత్నాల రథం రు. 12-50
అడ్డదిడ్డమైన తమ కుటుంబ పరిస్థితుల్ని చక్కదిద్దాలనుకునే గృహిణులు, బాగుపడాలనుకునే పురుషులు చదివి తీరవలసిన కుటుంబగాథ....
శ్రీమతి మాలతీచందూర్ నవల
ఓ మనిషి కథ రు. 16-00
మధ్యతరగతి కుటుంబాలలోని ఈనాటి ఆడపిల్లల అవస్థలను అతి నాజూకైన తన కథా కథనంతో తీర్చిదిద్దిన....
బద్దెపూడి సుధారాణి నవలలు
ప్రేమే నేరమౌనా రు. 12-00
వాసంతి రు. 11-00
ఇంకా....
ప్రసిద్ధ హిందీ రచయిత
శ్రీ గుల్షన్ నందా నవల
సాయం సంధ్య రు. 12-00
ఉత్తమ కన్నడ రచయిత
శ్రీ బీ. చి. నవలలు
బ్రహ్మచారి కొడుకు రు. 11-00
వెండి రేఖలు రు. 13-00
సామవేదుల గీతారాణి నవల
డాక్టర్ వేణు రు. 16-00
కోగంటి విజయలక్ష్మి సెల్వరాజ్ నవల
చక్రబంధం రు. 13-00
అన్ని పుస్తకాల షాపులలోనూ దొరుకుతవి. లేదా మీకు కావలసిన పుస్తకాల ధరలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపండి. ఆ రూపాయికి V.P.P. లో పంపుతాం.
క్వాలిటీ పబ్లిషర్స్,
రామమందిరం వీధి. విజయవాడ-2.

దీప్తి : అది మన సంప్రదాయం!

మూరజ : నాకీ సంప్రదాయాలు నచ్చవు. అయినా ఇంతమందిలో తలవంచి ఆయన కాళ్ళకు నేను మ్రొక్కను. వస్తా!

మాధవ్ : మూరజా!

దీప్తి : గట్టిగా పిలవకు. వాడు వెళ్ళిపోయాడు, మాధవ్! నీది సాత్విక ప్రవృత్తి. వాడిది తామస ప్రవృత్తి. పద ... నిన్నే పిలుస్తున్నారు మైకులో.

( విరామం )

సైన్సు క్లబ్బు ప్రతినిధి : రసజ్ఞులైన సదస్సులకు స్వాగతం! డాక్టర్ దీప్తి విశేష పరిశోధనల ఫలితంగా శ్రీ మాధవ్ ప్రతిరూపాన్ని సృష్టించగలిగారు. ఆ చిరంజీవియే మూరజ! ఈ నాడు శ్రీ మాధవ్, చిరంజీవి మూరజ ఈ వేదికమీద ఉన్నారు రెండు దీపాల్లా. దీపానికీ, దీపానికీ పెద్ద తేడా ఉండదు—ప్రమిదల రూపంలో తప్ప.

ఈ ప్రయోగం విలక్షణత గురించి డాక్టర్ దీప్తి ముందు పరిచయం చేస్తారు.

దీప్తి : మన శరీరాలలో రెండు రకాల జీవకణాలు ఉంటాయి. మొదటిది సామాన్య జీవకణాలు. ఇవి శరీరంలోని అంగాంగాల పెరుగుదలకు దోహదం చేస్తాయి. రెండవదిబీజకణాలు. ఇవి స్త్రీ, పురుష బీజకణాలుగా ఉంటాయి. వీటిలో అర్థసంఖ్య క్రోమోజోమ్స్ ఉంటాయి. ఈ రెండు బీజకణాలు సంయోగించి సంయుక్త బీజకణం ఏర్పడుతుంది. దాని నుండి పూర్తి పిండం పెరుగుతుంది. ఇది మామూలుగా జరిగే ప్రత్యుత్పత్తి క్రియ. అయితే, మేలుజాతి జీవుల సృజనకు అలింగోత్పత్తి ఒక పద్ధతి అని జీవ రసాయన శాస్త్రంలో సూచిస్తోంది. ఈ పద్ధతి ప్రకారం స్త్రీ లేదా పురుషుని శరీరం నుండి జీవకణాన్ని సేకరించి, దానిని స్త్రీఅండంలో ప్రవేశపెడతారు. ఆ అండంలోని కేంద్రికను నాశనం చేస్తారు. ఇప్పుడు స్త్రీ లేదా పురుష సామాన్య కణం పెరుగుదల ప్రారంభిస్తుంది. ఈ సంక్లిష్ట ప్రయోగ ఫలితంగా మనిషికి నకలును సృష్టించగలం. నేనీ ప్రయోగాన్ని కృత్రిమ గర్భకోశంలో చేశాను. ఇది విస్తృతమైతే మేధావులను, సుందరీమణులను ఎప్పటికీ కోల్పోనవసరం లేదు. ఒక విధంగా ఇది మృత్యువును జయించినట్లే. కాని, మానవ ప్రకృతిపై విజయం మాత్రం అవునో, కాదో చెప్పలేం.

క్లబ్ ప్రతినిధి : ఈ అపూర్వక్షణం గురించి శ్రీ మాధవ్ ఒక ఖండిక చెబుతారు.

మాధవ్ : (సాత్వికంగా ) "ఇది అపూర్వ సమాగమం
శిశిరం తనలోని వసంతాన్ని
చూసుకొంటున్న క్షణం—
అమావాస్య తనలోని
పున్నమిని వీక్షిస్తున్న తరుణం
ఇది ఉషస్సంధ్యల సమాగమం
నిన్న—నేడుల వింత సమ్మేళనం."

(తప్పట్లు)

క్లబ్ ప్రతినిధి : ఇప్పుడు మూరజ కవితాగానం చేస్తారు.

మూరజ : (నిర్లక్ష్యంగా, రాజసంగా ) మిత్రులు ఇందాక దీపానికీ, దీపానికీ ప్రమిదల రూపంలో తప్ప తేడా లేదన్నారు. కాని, అది తప్పు. ప్రమిద రూపంలో తేడా గణింప తగ్గదికాదు. కాంతి ప్రమాణాన్నిబట్టి దీపాల మధ్య అంతరం ఉంది. కాకపోతే మనం 'కాండిల్ పవర్' అని ఎందుకు వ్యవహరిస్తున్నాం. అందుచేత దీపం ఒక్కటే అయినా, కాంతిభేదం ఉంది. అలాగే భౌతికంగా మనిషి ఒక్కలాగే ఉన్నా, బౌద్ధిక భేదం ఉంది. ఇక నా కవిత...

"ఇది వైజ్ఞానిక వరప్రసాదం
సంవత్సరాల సుదీర్ఘ పరిణామం
మేధోయవనిక మీద స్వల్ప ప్రమాణం
అవసరం వలలో చిక్కిన ముత్యం ఈ సత్యం—
ఇది అగ్ని ఆత్మావలోకనం
చేసుకొంటున్న క్షణం
అది అసంతృప్త మానసం నిన్న
ఇది సంతృప్త చేతనం నేడు

22—9—82

మరి రేపు...
ఏమో అది నైరూప్యం'' (రిపీట్ )
(హర్షధ్వానాలు—విరామం )

**7**

మాధవ్ : (ఆత్మ న్యూనభావంతో )
అది అసంతృప్త మానసం నిన్న
ఇది సంతృప్త చేతసం నేడు.
రేపు—ఏమో—అది నైరూప్యం!

''అది అసంతృప్త మానసం..'.' ఈ మాటలు నా గురించే అన్నాడు. అవును. నాది—అసంతృప్త మానసం నిన్న....

దీప్తి : మాధవ్! లైటు వేసుకోకుండా కూర్చున్నావేం చీకట్లో?

మాధవ్ : చీకట్లో ఉన్న మనిషికి వెలుగులో వస్తువులన్నీ కనిపిస్తాయి. కాని, వెలుగులో ఉంటే చీకటి ఆత్మ అంతుపట్టదు. అందుకే చీకటి అంటే నాకు ఇష్టం.

దీప్తి : సూరజు వచ్చాడా?

మాధవ్ : వాడు మూడు ఝాములు దాటాక వస్తాడు.

దీప్తి : ఇవ్వాళ త్వరగా రమ్మన్నానే !

మాధవ్ : నీ మాటమీద గౌరవం ఉంచి వచ్చినా తప్ప తాగి వస్తాడు. అసలు వస్తాడని నేను అనుకోను. మనం భోజనం చేద్దాం పద.

దీప్తి : నీకు వడ్డిస్తాను. నేను సూరజుతో తింటాన్లే. వాడితో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి.

మాధవ్ : వాడిమీద నీ కెందుకంత శ్రద్ధ ?

దీప్తి : నీకుమాత్రం లేదా అమాత్రం శ్రద్ధ !

మాధవ్ : (నవ్వుతాడు ) అదిగో సూరజు వచ్చాడు.

సూరజు : (మత్తులో ) మీరు రమ్మన్నారుగా! వచ్చేశా...ఆశ్చర్యపోతున్నారా? నేనే సూరజుని. రాత్రి ఉదయించిన సూర్యుణ్ణి. పగలు ప్రభవించే చంద్రుణ్ణి. అవునా, కాదా ? మీరే చెప్పండి.

మాధవ్ : నిజమే! పగటి చంద్రుడిలా, రాత్రి సూర్యుడిలా నువ్వో అబ్బురమే!

సూరజు : బాగా చెప్పారు. మీరు నాకు నచ్చారు.

దీప్తి : సూరజు ! నువ్విలా తాగి రావచ్చా?

సూరజు : మామూలుగానే వద్దాం అనుకొన్నాను. కాని, వేళకు ఇది వేసేయాలి. అదీగాక సంఘాన్నీ, పెద్దవాళ్ళనీ—ఇలాంటి కృతక భావాలూ, భయాలూ పెట్టుకొని అసహజంగా నేను బతకలేను. సహజ వర్తనం, స్వేచ్ఛా ప్రవృత్తి నాకు ఊపిరి. వస్తా ! బై...

దీప్తి : ఆగు ! అక్కడే కూర్చో.

సూరజు : నన్ను ఆజ్ఞాపిస్తున్నారే ? ఎక్కడిది మీ కీ అధికారం ?

మాధవ్ : నేను చెబుతాను ఆ అధికారం ఎలా వచ్చిందో? ఎక్కడినుంచి వచ్చిందో !

సూరజు : (నవ్వి ) ఎవరి పరీక్ష పేపరో మరెవరో రాసినట్లుంది మీ వరస.

మాధవ్ : సూరజు ! నిన్ను పోషిస్తున్న తల్లి—దీప్తి.

సూరజు : (పొరలు పొరలుగా నవ్వుతూ ) తల్లి....అమ్మ ! ఎవరి కెవరు అమ్మ? నాకు అమ్మా, నాన్నా—ఎవరూ లేరు. ఆ లేబరేటరీలో లేడికూనల్లా, కుందేలు పిల్లల్లా, గిని పందుల్లా నేనూ కృత్రిమంగా సృష్టించబడ్డాను. వాటిమీద ఎవరి జులుం లేదు. నా కెందుకీ బంధాలు? నాకు ఇవేవీ వద్దు. నేను ఒంటరిని, అంతే !
మందిలో ఉన్న మనిషి దొంగ, ఒంటరి మనిషి నిజం...బై ! బై ! వస్తా—నిద్ర వస్తోంది. గుడ్ నైట్!

దీప్తి : సూరజు ఒక్కమాట విను.

సూరజు : (మగతగా) రమ్మన్న టైమ్‌కి వచ్చాను. మాట్లాడతానని మీరు ముందు చెప్పలేదు. నాతో వివరంగా అన్నీ ముందు చెప్పి టైమ్ ఫిక్స్ చేసుకోవాలి. గుడ్ నైట్ !

దీప్తి : సూరజు ! అంత నిర్లక్ష్యం పనికిరాదు.

మాధవ్ : వాడు వెళ్ళిపోయాడు—నిర్లక్ష్యంగా, నిస్సంకోచంగా...

దీప్తి : (ఉదాసీనంగా ) మాధవ్! నీలో నిద్రాణమైన రాజసం, తామసం,


బినాకా టూత్‌బ్రష్.
దీని భద్రమైన
'గుండ్రటి కొసలు' ఇగుళ్ళను
ఏమాత్రం గాయపరచవు.




బినాకా టూత్ బ్రష్‌ల సముదాయంలో—
కుటుంబంలో ప్రతి ఒక్కరికీ
కావలసినదొకటి వుంది.




బినాకా
భారతదేశంలో అత్యధికంగా
అమ్ముడయ్యే టూత్‌బ్రష్.

ULKA-BT-1-80 TEL

తెగింపు అన్నీ వాడిలో విజృంభించాయి.

మాధవ్ : (ఆత్మ న్యూనభావంతో ) దీప్తీ ! లోకం ఎరిగిన మాధవ్ వేరు, అసలు మాధవ్ వేరు. భావుక కవిగా లోకం ఆరాధించి, మన్నిస్తున్న ఈ మాధవ్ ప్రకృతి ఆరాధకుడు. కాని, లోపలి మాధవ్ విషయ, వాసనాలోలుడు—అంతేనా?

దీప్తి : ఎందుకు నిన్ను నువ్వే న్యూనపరుచుకుంటావు. ఈ గుణాలన్నీ సమాంతరాలు. బింబ ప్రతిబింబాలు.

మాధవ్ : నా దృష్టిలో బింబం మాయ. ప్రతిబింబం నిజం. లోకానికి తెలిసిన మాధవ్ మాయ. అంతా మాయ.

(వి రా మ ం )

**8**

( ఫోను మోగుతుంటుంది )

మాధవ్: ( ఫోను ఎత్తి ) హలో! ఆ! అవునండీ! డాక్టర్ దీప్తిగారి రెసిడెన్సే, ఆ. సారీ! రాంగ్ నెంబర్. ( ఫోను పెట్టాడు)

సూరజా: ఫోను చేసింది ఎవరు? ఉషారాణియేనా?

మాధవ్: ( తడబడుతూ ) కా. కా. కాదే!

సూరజా: నిజం చెప్పేవాడు తడబడడు. ఎందుకు, సార్, అబద్ధం ఆడతారు. సరిగ్గా సాయంత్రం ఆరు గంటల నలభై అయిదు నిమిషాలకి ఉషారాణి ఫోన్ చేస్తానంది. ఫోన్ దగ్గర మీ వంటి గబ్బిలాయిలు ఉంటారని ఆమెకు తెలియదు.

మాధవ్: సూరజా! నీ ప్రవర్తన మారాలి. రోజు రోజుకు నీ ఆగడాలు మితిమీరుతున్నాయి. కక్ష్య తప్పిన నక్షత్రం పతన మవుతుంది.

సూరజా: ( తేలికగా ) రేకులు రాలిపోయాక అయ్యో లోకానికి సెంటు నివ్వలేక పోయామని విలపించే గులాబీలా మీరా నాకు ధర్మోపదేశాలు చేస్తున్నారు. జీవితాన్ని స్వేచ్ఛగా అనుభవించడం నా నీతి. ( కర్కశంగా ) ఉషారాణి ఫోన్ చేసిందా, లేదా?

మాధవ్: చేసింది.

సూరజా: ( నిలదీస్తూ ) మరి రాంగ్ నెంబర్ అన్నారేం?

మాధవ్: ( అనునయంగా ) సూరజా! డాక్టర్ దీప్తికి జ్వరంగా ఉంది. నిన్ను చూడాలంటూంది. ఒక్కసారి చూసి వెళ్ళు.

సూరజా: నో.నో. నాకు అవతల ఎంగేజిమెంట్స్ ఫిక్స్ అయాయి. మీ రున్నారుగా! నేను చూసి చేసేదేముంది. ఇవాళ కాలేజి స్టూడెంట్స్‌తో మహాబలిపురం పిక్‌నిక్‌కి వెళుతున్నాను.

మాధవ్: నీకు తల్లి వంటిది దీప్తి!

సూరజా! నాన్సెన్స్! నా కెవరూ లేరు. ఈ లోకం పాంథశాల. మనం బాటసారులం. ఈ ప్రపంచం ఒక రసాయనశాల. మనం మూలకాలం. సంయోగ వియోగాలు కాలప్రేరితాలు. అంతే... వస్తా!

మాధవ్: ( అధికారికంగా ) నిన్ను వెళ్ళనివ్వను.

సూరజా: మీ రెవరు అధికారం చెలాయించడానికి?

మాధవ్: ఆత్మీయత కోరుకుంటున్న నీ మూల పురుషుణ్ణి.

సూరజా: ( హేళనగా ) మూలపురుషుడుంగారూ! మూల కూర్చోండి. అడ్డు తప్పుకోండి.

మాధవ్: ( కోపంగా ) అంతేనా!

సూరజ: మూమ్మాటికీ అంతే, మాధవ్‌గారూ! మృత్యువుకూడా ఇంటర్వ్యూ కోరి రావాలి నా దగ్గరకు. అంత బిజీ, పెర్‌ఫెక్ట్, పంక్చువల్ మనిషిని నేను. వస్తా!

మాధవ్: ( నిస్సహాయంగా ) సూరజా!

( విరామం )

దీప్తి: ( నీరసంగా ) వాడితో ఘర్షణ పడ్డావా?

మాధవ్: ( కోపంగా ) ముందు ప్రాధేయ పడ్డాను. వినలేదు. కొంచెం గట్టిగా అరిచాను. ఫలితం లేకపోయింది. మృత్యువుకూడా ఇంటర్వ్యూ అడిగి రావాలి నా దగ్గరకు అని అశుభం మాటలు అని విసురుగా వెళ్ళిపోయాడు




**సింకారా కుటుంబాలు**
**ఆరోగ్యమైన కుటుంబాలు**

కేవలం సింకారా టానిక్‌లో మాత్రమే అన్ని విటమిన్‌లు, ఖనిజ లవణాలతోపాటు మన రోజు వారీ ఆహారంలోని పోషక పదార్థాల నన్నిటిని జీర్ణం చేసుకునేందుకు తోడ్పడే 14 మూలికౌషధాలు కూడా ఉన్నాయి.

సంపూర్ణ ఆరోగ్యాభివృద్ధికి సింకారా టానిక్‌ను వాడండి.




HD-5950A

**సింకారా**

Hamdard

ప్రతి ఒక్కరికీ అన్నికాలాలలో పనికొచ్చే సర్వోత్తమ టానిక్.

చీ! చీ!

దీప్తి: అంత కోపం దేనికి? వాడు చిన్నవాడని సరిపెట్టుకుంటే పోలే?

మాధవ్: దీప్తీ! సూరజు అగడాలకు మితి లేకుండా పోయింది. మొన్న బ్రోతల్స్‌లో ఇరుక్కున్నాడట. ఎస్. ఐ. గారికి చెప్పి విడిపించాను.

దీప్తి: నువ్వు మాత్రం ఆ వయస్సులో ఆడపిల్లలకి పోజులు కొట్టేవాడివి కావూ?

మాధవ్: సౌందర్యాన్ని ఆరాధించడం వేరు, లోలుపత్వం వేరు.

దీప్తి: నీలో ఆరాధనా, వాడిలో లోలుపత్వం—ఈ రెండిటి సరిహద్దురేఖ చాలా సున్నితమైనది.

మాధవ్: నా ప్రతిరూపం నేను అనుకున్నట్లు వికసించ లేదు. ( కోపంగా ) భావుకత్వంలో విషయ లోలుపత్వానికి స్థానం లేదు. అందుకని ఆ లోలుపత్వాన్ని నాశనం చేస్తాను. నాశనం చేస్తాను.

దీప్తి: సూరజ్‌కి ఎటువంటి అపచారం జరిగినా నేను సహించను. విజ్ఞాన ప్రపంచానికి వాడి సృష్టి ఒక గర్వ కారణం. పిచ్చి పిచ్చి ఆలోచనలు మానేసెయ్.

మాధవ్: సరే ఈ వేదన నేను భరించ లేను. అందుకని దూరంగా పోతాను. అనంత దూరాలలో శాంతిని అన్వేషిస్తాను. ఈ విలక్షణ ప్రకృతిని గురించి మథిస్తాను—అంత స్సాగరంలో.

దీప్తి: ఎంత పసివాడివి నువ్వు.

( ఫోన్ మోగింది. )

దీప్తి: హలో! నేను దీప్తిని మాట్లాడుతున్నాను. ఆ! జనరల్ ఆస్పత్రి నుంచా! చెప్పండి. ఆ! సూరజు ప్రమాదంలో మరణించాడా? సూరజ్! సూరజ్!


మాధవ్: దీప్తీ! సూరజ్‌కి ఏమైంది?

దీప్తి: సూరజు—మన రాత్రి సూర్యుడు కారు ప్రమాదంలో మరణించాడు.

మాధవ్: ( పిచ్చిగా ) ఆ! సూరజ మరణించాడా? నేను నమ్మను. మృత్యువు కూడా ముందు ఎపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకు రావాలని దీమాగా చెప్పిన నా బాబు చచ్చిపోయాడా? నేను నమ్మను.

దీప్తి! కాని, ఇది నిజం.

మాధవ్: ( గద్గద గంభీర భావాలు మిళితం కాగా )
సూరజ్! సూరజ్! దీప్తి! దీప్తీ!




చుట్టూ చీకటి నల్ల్రి వూడలు దింపింది.
ఇంక కాంతి ఎక్కడ? సూర్యు డెక్కడ?
ఆ. ఆ అద్దం నన్ను వెక్కిరిస్తూంది!

( నవ్వి ) "అద్దంలో నువ్వు నువ్వే కాని, నీలో నువ్వే వేరు" ( రిపీట్ )

ఇది ఉషస్సంధ్యల విలసనం
రేపటి వెలుగులో నిన్నటి నీడల నర్తనం
ఇది అసంతృప్త మానసం నేడు
అది సంతృప్త చేతనం నిన్న
మరి రేపు? ఏమో అది నైరూప్యం!
( శుష్కంగా నవ్వి )

దీప్తీ! వాడు సైన్స్ ప్రపంచానికి విజయ గర్వం కావచ్చు. కాని, నా సంకల్పానికి ఇది ఘోర పరాజయం.

★

